

# పోలింగ్‌కు వేళాయె..

- ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- పోలింగ్ కేంద్రాలకు తరలిన ఎన్నికల సిబ్బంది
- పంపిణీ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి జితేశ్ వీ పాటిల్



మద్నూర్ జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సామగ్రిని సరిచూసుకుంటున్న పోలింగ్ సిబ్బంది



కామారెడ్డి, నవంబర్ 29 : జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికారులు పూర్తి ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 913 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. 3800 మంది ఎన్నికల సిబ్బందిని నియమించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బుధవారం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రిని పోలింగ్ సిబ్బంది తీసుకొని, వారికి కేటాయించిన కేంద్రాలకు తరలివెళ్లారు. పోలింగ్ సిబ్బంది కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

**డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల పరిశీలన**

జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బంది, అధికారులకు పలు సూచనలు చేశారు.పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన ప్రతి బస్సుకూ జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. తిరిగి రిసెప్షన్ కేంద్రాలకు వచ్చిన తర్వాత క్లోజ్డ్ కంటైనర్లద్వారా స్ట్రాంగ్ రూమ్‌లకు జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా తరలిస్తామని అన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంను జిల్లా ఎన్నికల అధికారి సందర్శించారు. రెండు రోజులు అత్యంత కీలకమని .. ఎలక్ట్రానిక్ మీడియా,సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలను నిశితంగా పరిశీలించాలన్నారు. ఓటింగ్ సరళికి సంబంధించి పుకార్లు, అసత్య వార్తలు ప్రసారమైతే వెంటనే సంబంధిత అధికారులకు తెలుపుతూ వాటి నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కు సంబంధించి ఓటింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలిస్తూ ఎటువంటి చిన్న సంఘటన దృష్టికి వచ్చినా వెంటనే తెలియజేయాలన్నారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సారి ప్రతి టేబుల్ వద్ద ఓట్ల లెక్కింపును సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూంలో కౌంటింగ్ హాల్‌లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ఆయన వెంట రిటర్నింగ్ అధికారులు మను చౌదరి, చంద్రమోహన్,మన్నె ప్రభాకర్,శ్రీనివాస్ రెడ్డి,నోడల్ అధికారులు సింహారావు, దయానంద్,సతీశ్ యాదవ్ ఉన్నారు.

**జిల్లా వ్యాప్తంగా 8,65,794 ఓటర్లు....**

కామారెడ్డి,ఎల్లారెడ్డి,జుక్కల్,బాన్సువాడ నాలుగు నియోజకవర్గాల్లో 8,65,794 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 4,19,226, స్త్రీలు 4,46,523 మంది, ఇతరులు 45 మంది ఉన్నారు. ఓటరు స్లిప్పులు లేని వారు గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక దానిని తీసుకెళ్లి ఓటు వేయాలని అధికారుల సూచించారు. ఓటరు గుర్తింపు కార్డు నంబర్‌ను టైప్ చేసి 921172 8082 కు ఎస్ఎంఎస్ ద్వారా కానీ, హెల్ప్‌లైన్ 1950 నంబర్ ద్వారా లేదా www.voters. eci.gov. in,www. ceotelangana.nic.in వెబ్‌సైట్ల ద్వారా పొందవచ్చని తెలిపారు.



కామారెడ్డి నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది



మద్నూర్‌లో ఎన్నికల సామగ్రిని అందుకుంటున్న పోలింగ్ సిబ్బంది



ఎల్లారెడ్డిలోని పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న ఎన్నికల సిబ్బంది




కామారెడ్డి పట్టణంలో ముస్తాబైన మహిళల ఆదర్శ పోలింగ్ కేంద్రం



కామారెడ్డిలో సందేహాలను నివృత్తి చేస్తున్న అధికారులు

